ప్రజాశక్తి

బుధవారం 15 మార్చి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి


మండలి ఉత్కంఠ

◆ గెలుపోటములపై సర్వత్రా విశ్లేషణలు
◆ఎవరి ధీమా వారిదే..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

బ్యాలెట్ బాక్సుల్లో పట్టభద్రుల తీర్పు ఉంది. అందరిలోనూ ఒక్కటే ఉత్కంఠ. గెలుపెవరిది ? ఓటమి అంచున ఉండేదెవరు ? పిడిఎఫ్, వైసిపి, టిడిపి, బిజెపిలలో ఎవరు చివరి వరకూ బరిలో ఉంటారు, ఎవరి ఓట్లు ఎవరు ఎక్కువగా లాక్కొంటారు ? అన్న చర్చ నేడు ఉత్తరాంధ్ర అంతటా సాగుతోంది. పిడిఎఫ్ ఓటింగ్ మాత్రం చెక్కు చెదిరే అవకాశాలు ఏ కోసానా కానరావట్లేదన్న భావన అన్ని తరగతుల్లోనూ ఉంది. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల ఓటింగ్‌లో పిడిఎఫ్‌తో తలపడే వారెవరు ? అన్న దానిపైనే అందరూ మాట్లాడుకుంటున్నారు.

ఎన్నికల క్యాంపెయిన్‌లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పేరు మార్మోగడంతో పైన తెలిపిన అన్ని పార్టీలూ ఆందోళనగానే ఉన్నాయి. మరో రెండు రోజుల్లో ఓటరు తీర్పు బయటపడనుంది. ప్రధాన రాజకీయ పార్టీల మధ్య ప్రభుత్వ వ్యతిరేక ఓట్ల చీలిక కూడా బలంగానే ఉండే అవకాశాలున్నాయన్నది రాజకీయ విశ్లేషకుల భావన. ఏదిఏమైనా ఈ నెల 16న కౌంటింగ్ ప్రారంభం, 17 నాటికి పూర్తి క్లారిటీ రానుంది. అప్పటి వరకూ నరాలు బిగబట్టుకుని కూర్చోవాల్సిందే.



సుధాకర్ (వైసిపి)



చిరంజీవి (టిడిపి)



డాక్టర్ కోరెడ్ల రమాప్రభ (పిడిఎఫ్)

కోటా ఓటుతో పీఠం దక్కించుకోవడం సాధ్యమేనా?

కోటా ఓటు అంటే మొత్తం పోలైన ఓట్లలో సగం కంటే ఒక్క ఓటు (మొదటి ప్రాధాన్యత) ఏ అభ్యర్థికి ఎక్కువగా ఉంటుందో వారే పట్టభద్రుల మండలి పీఠం అధిరోహించనున్నారు. ఈ ఎన్నికలో రెండో ప్రాధాన్యతా ఓటుకు చెప్పుకోదగ్గ విలువే ఉంది. పోలైన లక్షా 72 వేల ఓట్లలో సగం కంటే ఒక్క ఓటు అధికంగా ఏ అభ్యర్థికి దక్కుతుందో వారిని డిక్లేర్ చేసేయవచ్చు.

అయితే అన్ని ఓట్లు ఒకే అభ్యర్థికి మూడు ప్రధాన పార్టీలు బరిలో ఉన్న నేపథ్యంలో పోలవ్వడం సాధ్యమైనదేనా? అంటే కష్టమే అన్నది రాజకీయ విశ్లేషకుల భావన. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండో ప్రాధాన్యతా ఓటుతోనే 2007 సంవత్సరం నుంచీ పలువురు అభ్యర్థులు గెలుస్తూ మిగతా 2లో..



టిక్కెట్ల కోసం పిఎం.పాలెం స్టేడియం వద్ద బారులుతీరిన యువకులు

జోరుగా భారత్, ఆసీస్ వన్డే టిక్కెట్ల అమ్మకం

నగరంలో మూడు చోట్ల విక్రయం - భారీ క్యూలు వార్త మెయిన్‌లో..

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమై 29వ తేదీ వరకూ జరుగనున్నాయి. 78 కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ ఈ పరీక్షలు జరుగుతాయని విశాఖ జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసే వాతావరణం మిగతా 2లో..

ఆర్‌బికెలు సరే.. సౌకర్యాలేవీ ?

వార్త 3లో..

పిల్లల హక్కులకు భంగం కలిగిస్తే సహించం

వార్త 8లో..

నిర్బంధం నడుమ జీడితోట వేలం

వార్త 7లో..



టీ షర్టులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ రాజాబాబు

జి-20 సదస్సుకు

40 దేశాల ప్రతినిధుల రాక

విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున వార్త 2లో..

పెరగనున్న విద్యుత్ వినియోగం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. ఉక్కబోత ఆరంభమైంది. కనెక్షన్లు మోతాదుకంటే విద్యుత్ వినియోగం ఎక్కువగా వుంది. రానున్న రోజుల్లో ఇది మరింత పెరగనుంది. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) ఉమ్మడి విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్‌లో ఈ ఏడాది జనవరి 23 నాటికి ఎల్‌టి కేటగిరీలో 17,20,992 కనెక్షన్లు, హెచ్‌టి కేటగిరీలో 1724 కనెక్షన్లు ఉన్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎసిల వాడకం పెరిగింది. దీనివల్ల సాధారణ రోజుల కంటే ఫిబ్రవరి నుంచి విద్యుత్ వినియోగం ఎక్కువ నమోదవుతూ వస్తోంది. గత ఐదేళ్ల కంటే ఈ ఏడాది ఆ వినియోగం పెరగనుందని విద్యుత్ శాఖాధి కారులు అంచనా వేస్తున్నారు. రాబోయే వేసవిలో ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పెరుగుతున్న

అధికమవుతున్న ఎసిల వాడకం

విద్యుత్ డిమాండ్‌కు తగినట్లు కోతల్లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 2259 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగంకాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి 23 నాటికి 2259 మిలియన్ యూనిట్లు వినియోగం నమోదైంది. ఈ నెల చివరికి ఈ వినియోగం అత్యధికంగా వుంటుందని అధికారులు చెబుతున్నారు.

ఎల్‌టి కేటగిరీలో కనెక్షన్ల పెరుగుదల 76.61 శాతంకాగా వినియోగం 84.42 శాతం వుంది. హెచ్‌టి కేటగిరిలో కనెక్షన్ల పెరుగుదల 76.61 శాతంవుండగా, వినియోగం 78 శాతం వుంది. గతం కంటే ఎసిల వినియోగం పెరగడం, దీనికితోడు ఎసిలు ఎక్కువ సమయం ఉపయోగించడంతో ఎల్‌టి కేటగిరీలో విద్యుత్ వినియోగం పెరుగుతూ వస్తోంది. 2017-18లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఎల్‌టి కేటగిరీలో 13,18,501 విద్యుత్ కనెక్షన్లుండగా, 2022-23 జనవరి 23 నాటికి 17,20,992కు పెరిగాయి.

సంవత్సరం	ఎల్‌టి కేటగిరీ కనెక్షన్లు	వినియోగం (మి.యూ)
2017-18	13,18,501	1907.79
2018-19	13,67,451	2020.70
2019-20	14,18,447	2207.18
2020-21	14,61,882	2200.83
2021-22	16,81,737	2447.87
2022-23	17,20,992	2259.98

(జనవరి 23 వరకు)

ఈ కాలానికి విద్యుత్ వినియోగం 1907.79 మిలియన్ యూనిట్ల నుంచి 2259.98 మిలియన్ యూనిట్లకు పెరిగింది. ఈ నెలాఖరుకు మరో ఐదు వందల మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం పెరుగుతుందని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు.

మొదటి పేజీ తరువాయి..

మండలి ఉత్కంఠ


వస్తున్న విషయం తెలిసిందే.

రెండో ప్రాధాన్యతా ఓటు.. చర్చోపచర్చలు

అధికార వైసిపి తరపున బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్ ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికల్లో ఆ పార్టీ శ్రేణులు తొలి ఓటును మాత్రమే కోరడం సర్వత్రా కనిపించింది. రెండో ప్రాధాన్యతా ఓటుపై దృష్టిసారించలేదు. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు విద్యావేత్తగా తన ఓట్లను ఉత్తరాంధ్రలో తన శిష్యులు, కోచింగ్ సెంటర్లు, విద్యా సంస్థల ద్వారా అభ్యర్థించారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు కూడా ఆయన గెలుపునకు కృషిచేశాయి. బిజెపి తరపున బరిలో ఉన్న పివిఎన్.మాధవ్ గత సారి తన తండ్రి పివి.చలపతిరావు పేరును ఉపయోగించుకుని కొంత పాపులర్ అయ్యారు. నాడు టిడిపి మద్దతుగా నిలిచి గెలిపించింది. ఈ దఫా ఎన్నికల్లో ఆయన చెప్పుకోడానికి చేసిందేమీ లేనందున ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఆయన అభ్యర్థిత్వాన్ని తిప్పికొట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను తన పార్టీ అమ్మకానికి పెట్టినా సమర్థించిన మాధవ్ పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఈ ప్రాంత ప్రజలున్నారు. 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అభ్యర్థిత్వాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, నిరుద్యోగ యువతీ యువకులంతా స్వాగతించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి పోలింగ్ రోజు 13న ఒకరిపై ఒకరు పోటాపోటీగా రెండో ఓటును కొన్నిచోట్ల పిడిఎఫ్‌కు వేశారన్న చర్చ సాగుతోంది. నిరుద్యోగులు ఆ పార్టీలకు మొదట ప్రాధాన్యం వేసిన చోటల్లా రెండో ప్రాధాన్యతగా పిడిఎఫ్‌ను ఎంచుకున్నారన్నది స్పష్టమవుతోంది. ఈ విషయంలో ఉత్తరాంధ్ర అంతటా ఇదే పబ్లిక్ టాక్‌గా ఉంది.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

కల్పించాలన్నారు. పేపర్ లీకేజీ, మాల్ ప్రాక్టీసులు ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతుంటాయని వాటిని సమర్ధవంతంగా ఎదుర్కోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షల సమయాలలో కేంద్రాల దగ్గరలోని జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లను మూసివేయాలని, నిబంధనల మేరకు విద్యార్థులు పరీక్షా హాలులోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులనూ తీసుకెళ్లరాదని తెలిపారు. పరీక్షల నిర్వహణ సమయంలో వేసవి కాలం కావున ముందస్తు జాగ్రత్తతో మున్సిపల్ శాఖ పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైద్య శాఖ వారు ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇంటర్మీడియట్‌కు సంబంధించి హెల్ప్ లైన్ నెంబర్ 0891-2567561ను అందుబాటులోకి తెచ్చామన్నారు.



వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిహెచ్.నర్సింగరావు

వెంకటేశ్వరరావు కుటుంబాన్ని సిహెచ్ఎన్ఆర్ పరామర్శ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నంలో 1980-90వ దశకంలో సిపిఎం, సిఐటియు ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన జ్యేష్ఠ వెంకటేశ్వరరావు అలియాస్ జంజీర్‌ను ఆయన సతీమణి వసంత, కుమారుడు రణధీర్‌లను సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మంగళవారం సాయంత్రం పరామర్శించారు. జ్యేష్ఠ వెంకటేశ్వరరావు సతీమణి వసంతకు కొద్ది నెలల క్రితం కేన్సర్ వ్యాధి సోకడంతో వైద్యం పొందుతున్నారు. అలాగే రణధీర్‌కు ఓ ప్రమాదంలో రెండు కళ్ల నరాలు చిట్లి చూపు దెబ్బతింది. అతనూ ఇంటికే పరిమితమై వైద్యం పొందుతున్నారు. నేవల్ డాక్‌యార్డులో వెంకటేశ్వరరావు ఉద్యోగం చేసిన తొలినాళ్లలో ఆయన కుటుంబం మొత్తం పార్టీ పనుల కోసం సమయం వెచ్చిస్తూ చురుకైన పాత్ర పోషించేదని నర్సింగరావు ఈ సందర్భంగా మననం చేసుకున్నారు. ఎండాడ - రుషికొండ - సాగర్‌నగర్ ప్రాంతమంతా కలిపి పంచాయతీగా ఉన్న 2000వ దశకంలో వెంకటేశ్వరరావు సతీమణి వసంత సిపిఎం నుంచి వార్డు మెంబర్‌గా పోటీచేసి గెలుపొందిన విషయం తెలిసిందే.

జి-20 సదస్సుకు 40 దేశాల ప్రతినిధుల రాక

విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో ప్రతిష్టాత్మక జి-20 సదస్సును ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహించబోతున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎయు కన్వెషన్ హాల్‌లో పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. జి-20 సదస్సుకు సంబంధించిన వివరాలను కలెక్టర్ వెల్లడించారు. ఈ నెల 27వ తేదీ నుంచి వివిధ దేశాలకు చెందిన డెలిగేట్స్ విశాఖ చేరుకుంటారని తెలిపారు. సుమారు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు జి-20 సదస్సులో పాల్గొంటారని అన్నారు. విశాఖ విమానాశ్రయంలో విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులకు మన సాంప్రదాయాల ప్రకారం స్వాగత ఏర్పాట్లు ఉంటాయన్నారు. 28వ తేదీన ప్రతినిధుల ప్యానెల్ చర్చలు ఉంటాయని, అదే రోజు రాత్రి అతిథులకు గాలా డిన్నర్ ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అందులో పాల్గొంటారని చెప్పారు. 29వ తేదీ ఉదయం యోగా, మెడిటేషన్ కార్యక్రమాలు ఉంటాయని, అనంతరం ప్యానెల్ చర్చలు జరుగుతాయని అన్నారు. 30న ప్యానెల్ చర్చలు అనంతరం విశాఖ మున్సిపల్ కమిషనర్ ఎంపిక చేసిన మూడు ప్రాంతాలను విదేశీ ప్రతినిధులకు చూపిస్తామని తెలిపారు. 31వ తేదీ ఉదయం సిటీ ప్లానర్స్, మున్సిపల్ కమిషనర్స్, ఇతర ఉన్నత అధికారులతో వర్క్‌షాప్ ఉంటుందన్నారు. అదే విధంగా ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు 'జన భాగీదారీ' కింద



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

వివిధ కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిందన్నారు. ఆ రోజు ఉదయం సిటీలో యోగా డ్రైవ్ ఉంటుందన్నారు. 19వ తేదీన ఆర్‌కె.బీచ్ నుంచి 3, 5, 10కె మారథాన్లు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. 22న మాక్ జి-20 సదస్సు నిర్వహణ, 24న జివిఎంసి ఆధ్వర్యాన సాగర తీర స్వచ్ఛతా కార్యక్రమం, 25న ప్రీ ఆర్ట్ కాంటెస్ట్, 26న వైజాగ్ కార్నివాల్ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ జి-20 సదస్సు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు 2350 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. డెలిగేట్స్ విమానాశ్రయం చేరిన దగ్గర నుంచి వారికి ఏర్పాటు చేసిన వసతి, వారు సందర్శించే ప్రాంతాలలో పటిష్ట బందోబస్తు ఉంటుందన్నారు. అదే సమయంలో సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ట్రాఫిక్ తదితర అంశాలపై దృష్టి సారిస్తామన్నారు. జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నగరంలో జరుగుతున్నందున ఈ నెల 22 నాటికి నగర సుందరీకరణ పనులు పూర్తి చేస్తామన్నారు. అందుకోసం సుమారు రూ.100 కోట్లు ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. అనంతరం జి-20 సదస్సుకు సంబంధించిన టీ షర్టులను ఆవిష్కరించారు.

అశ్లీల చిత్రాలను నియంత్రించండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సోషల్ మీడియా వేదికగా, యువత లక్ష్యంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ అశ్లీల చిత్రాలకు కేంద్ర బిందువుగా మారిపోయాయని, ఈ క్రమంలో ఆ చిత్రాలను నియంత్రించాలని ఎఐవైఎఫ్ విశాఖ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, కో - కన్వీనర్ కె.అచ్యుతరావు కోరారు. మంగళవారం నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. అశ్లీల చిత్రాల వల్ల యువత తప్పుదోవపడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి యువతను ప్రగతి పథంలో నడిపించాలని కోరారు.

ఆర్‌బికెలు సరే.. సౌకర్యాలేవీ?

ఎరువులు, విత్తనాల నిల్వ చేసుకునేదెక్కడ?
గోదాములు నిర్మిస్తే బాగుండేది
గ్రామ సచివాలయాల్లో నిల్వకు యోచన?



శింగనబందలోని రైతు భరోసా కేంద్రం(ఫైల్)

ప్రజాశక్తి -భీమునిపట్నం

భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో రైతు భరోసా కేంద్రాలు నిర్మించినా ఎంతో ప్రాధాన్యం, అవసరం గల గోదాములు నిర్మించలేదని పలువురు రైతులు వాపోతున్నారు. భీమిలి మండలంలో 13, ఆనందపురం మండలంలో 18, పద్మనాభం మండలంలో 16 రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. అయితే ఎరువులు, విత్తనాలను నిల్వ చేసుకునేందుకు వీలుగా వేర్వేరుగా గోదాములు నిర్మించి ఉంటే బాగుండేదని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. నిధులు లభ్యత ఆధారంగా ప్రాధాన్యతను ఎంచుకుని సుమారు 20 నుంచి 30 మెట్రిక్ టన్నుల మేర ఎరువులు నిల్వ చేసుకునేలా గోదాములు నిర్మించి ఉంటే ఎంతో ఉపయుక్తంగా ఉండేదన్న అభిప్రాయం కూడా రైతుల నుంచి వ్యక్త మవుతోంది.

గోదాములు లేక సకాలంలో అందని ఎరువులు

అందుబాటులో గోదాములు లేకపోవడంతో సామాన్య రైతులకు సకాలంలో ఎరువులు లభ్యం కాని పరిస్థితి ఉండనే ఉంది. ఆర్‌బికెలు కేంద్రంగా ఎరువుల పంపిణీ జరుగుతోంది. అయితే ఇక్కడ ఓ సమస్య ఉత్పన్నమవుతోంది. ఎరువుల సరఫరా అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంది. ఆర్‌బికెల ద్వారా ఏ మేరకు ఎరువులు అవసరమనేది ముందుగా ఆన్‌లైన్‌లో పంపిస్తే, లారీల ద్వారా ఎరువులు వస్తాయి. అక్కడికక్కడే వాటిని రైతులకు అందజేయాల్సి ఉంటుంది. ఎరువులు వచ్చే సమయంలో రైతు వద్ద డబ్బులు లేకుంటే ఎరువులు లభ్యం కాని పరిస్థితి ఉంది. కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసే ఎరువులను రైతులకు రాయితీతో అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో సహజంగానే సబ్సిడీ ధరకు లభించే ఎరువులపై ఆసక్తి చూపుతారు. ఎరువులు వచ్చే సమయానికి రైతుల వద్ద డబ్బులు లేక ఎరువుల కోసం అనివార్యంగా ప్రైవేట్ డీలర్లను ఆశ్రయిస్తుంటారు. అంటే ఇక్కడ నష్టపోయేది సామాన్య రైతులే. ధనిక రైతుల వద్ద డబ్బులు ఉంటాయి. వచ్చే ఎరువులను వెంటనే కొనుక్కునే శక్తి సామర్థ్యాలు వారికే ఉంటాయి.

జరుగుతున్న వస్తు మార్పిడి

రైతు తాను పండించిన ధాన్యాన్ని ప్రైవేట్ ఎరువుల డీలర్‌కు ఇస్తే, సంబంధిత డీలర్ అతని వద్ద ఉన్న ఎరువులను ఇస్తున్నారు. ప్రైవేట్ డీలర్ పక్కా వ్యాపార దృష్టితో ఆలోచిస్తారు. ఇది సహజం కూడా. ఈ క్రమంలో తక్కువ ధరకే ధాన్యం కొంటారు. ఎక్కువ ధరకు ఎరువు అమ్ముతారు. ఏడా, పెడా రైతుకు ఆర్థికంగా నష్టమే. అంటే ప్రభుత్వం గోదాములు నిర్మించకుంటే సామాన్య రైతుకు ఏ స్థాయిలో నష్టం జరుగుతుందో ఇట్టే చెప్పవచ్చు.

ముందు చూపు లేకనే?

లక్షల రూపాయలు ఖర్చు చేసి ఇప్పటికే నిర్మించిన ఆర్‌బికెల ద్వారా రైతులకు పలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. ధాన్యం కొనుగోలుకు సంబందించి ధాన్యం నమూనాలు, భూసార పరీక్షా నమూనాలు, రైతులకు వ్యవసాయ విజ్ఞానాన్ని పెంచే గ్రంథాలయం, టెలివిజన్ సౌకర్యం ఇలా పలు సదుపాయాలు రైతు ముంగిటకు చేర్చిన ప్రభుత్వం, ఎంతో ప్రాధాన్యత గల, రైతులకు ఎక్కువ మేలు చేసే గోదాములు నిర్మాణాన్ని విస్మరించింది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి ఆర్‌బికెలకు అనుసంధానంగా ఎరువులు, విత్తనాలు నిల్వ చేసుకునేందుకు వేర్వేరుగా గోదాములు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. గోదాములో ఎరువులు, విత్తనాలు పక్క పక్కనే నిల్వ ఉంచరాదు. అలా ఉంచితే విత్తనం మొలక శాతం దెబ్బ తింటుంది.

ఎరువుల కోసం పాకులాట

సబ్సిడీ ధరకు లభించే ఎరువుల కోసం రైతు ఏటా ఎగబాకుతున్న పరిస్థితి ఉండనే ఉంది. ఇది ముమ్మాటికీ పాలకుల చేత కాని తనమనే చెప్పాలి. కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న యూరియా, డిఎపి, పొటాష్ ఎరువుల సరఫరా నెల వారీ జరుగుతుంది. విత్తనాలు అనేవి రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న ఎపి విత్తనా భివద్ధి సంస్థ పరిధిలోకి వస్తాయి.

2022 ఏప్రిల్ మొదలు కొని 2023 మార్చి 2వ తేదీ వరకు గత ఖరీఫ్, రబీ సీజన్లలో యూరియా, డిఎపి, పొటాష్ భీమిలి మండలంలో 230 మెట్రిక్ టన్నులు, ఆనందపురం మండలంలో 156మెట్రిక్ టన్నులు, పద్మనాభం మండలంలో 549 మెట్రిక్ టన్నులు సరఫరా జరిగింది. మొత్తంగా ఈ మూడు మండలాల్లో 935 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా జరిగింది. సన్న, చిన్న కారు రైతులకు ఎరువులు సకాలంలో లభించక పోవడంతో అదనంగా మరో వెయ్యి మెట్రిక్ టన్నుల ఎరువులు ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పరంగా గోదాములు లేక పోవడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు.

గ్రామ సచివాలయాల్లో ఎరువుల నిల్వకు యోచన?

గ్రామాల్లో ప్రభుత్వ గోదాములు లేనందున, ప్రైవేట్ గోదాములను ఏర్పాటు చేసుకుని రైతులకు సకాలంలో, సరిపడా ఎరువులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అందుకు అవసరమైన అద్దె కూడా చెల్లిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఎటూ ప్రైవేట్ గోదాములు అందుబాటులో లేని పరిస్థితి ఉందని, ఇప్పటికే నిర్మించిన గ్రామ సచివాలయాలు కేంద్రంగా ఎరువులు నిల్వ చేసుకునే యోచనలో వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

గ్రామ సచివాలయం గానీ, వార్డు సచివాలయం గానీ 20 మెట్రిక్ టన్నులు నిల్వ చేసుకునేలా ఇప్పటికే గోదాము తరహా ఓ గది నిర్మితమై ఉంది. ఇందులో నిరుపయోగంగా పడి ఉన్న ఎలక్ట్రికల్ సామాన్లు ఇతరత్రా ఉంచుతున్నారు. వీటిలో ఎరువుల నిల్వ చేసుకునే యోచనలో వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

భీమిలి మండలంలోని 16 పంచాయతీల్లో 13 సచివాలయ భవనాలు, ఆనందపురం మండలంలోని 26 పంచాయతీల్లో 18, పద్మనాభం మండలంలోని 22 పంచాయతీల్లో 16 గ్రామ సచివాలయ భవనాలు ఉన్నాయి.

నేరాలు ఘోరాలు



గాయపడ్డ కండక్టర్, డ్రైవర్

ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌పై దౌర్జన్యం

- నిందితుల్లో పట్టుబడిన మహిళ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై సుమారు ఆరుగురు దౌర్జన్యానికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ సంఘటన డిపోకు సమీపంలో జరిగింది. సంఘటనలో గాయపడ్డ కండక్టర్ పి.శశిభూషణరావు, డ్రైవర్ బి.లక్ష్మణరావును కెజిహెచ్‌కు తరలించారు. కండక్టర్‌కు తలపై తీవ్ర గాయమైంది. బాధితుల కథనం ప్రకారం విశాఖపట్నం డిపోకు సమీపంలో ఎస్ఎం రోడ్డులో ఆర్టీసీ అద్దె బస్సును బయలుదేరేందుకు ఉంచారు. బస్సులో డ్యూటీ కోసం కండక్టర్ శశిభూషణరావు ఉన్నారు. డ్రైవర్ లక్ష్మణరావు బస్సును తీసేందుకు వస్తున్నారు. అదే సమయంలో రెండు మోటార్ బైకులపై ఆరుగురు వచ్చి బస్సు అద్దాలను పగలగొడుతున్నారు. కండక్టర్ బస్సు దిగి ఎందుకు పగలగొడుతున్నారని ప్రశ్నించారు. దీనికి సమాధానం చెప్పకుండా వారు కండక్టర్‌పై ఇనుప రాడ్డుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అదే సమయంలో బస్సు వద్దకు వస్తున్న డ్రైవర్ లక్ష్మణరావు గుర్తించి, వారిని ప్రశ్నిస్తుండగా ఆయనపై కూడా దౌర్జన్యానికి పాల్పడ్డారు. డ్రైవర్ కేకలు వేయడంతో సమీపంలో ఉన్న ఆర్టీసీ సిబ్బంది అక్కడకు చేరుకొని, నిందితులను పట్టుకునే ప్రయత్నం చేశారు. నిందితులు మోటార్ బైకులపై పరారయ్యారు. వారిలో ఒక మహిళను మాత్రం పట్టుకున్నారు. ఆమెను త్రీ టౌన్ స్టేషన్‌కు ఆర్టీసీ సిబ్బంది అప్పగించారు. కేసును త్రీ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిందితులంతా, గంజాయి తాగి ఉన్నారని భావిస్తున్నారు. సంఘటన గురించి తెలిసిన వెంటనే ఆర్టీసీ హైయిర్ బస్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) గౌరవాధ్యక్షులు వి.తులసీరామ్ కేజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న కండక్టర్, డ్రైవర్లను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బందికి యాజమాన్యం తగు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘటనలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు. అలాగే సంఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

దేశరక్షణ దళానికి గీతం విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన కె.రాహూల్ దేశరక్షణ దళం బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్) అసిస్టెంట్ కమాండెంట్‌గా నియమితులయ్యారు. గీతంలో 2013-17 సంవత్సర కాలంలో బిటెక్ ఇసిఇ పూర్తిచేసిన కె.రాహూల్ 2021లో జరిగిన యుపిఎస్‌సి పరీక్షలలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో 130వ ర్యాంకు సాధించారు. బిఎస్ఎఫ్ అకాడమిలో ఏడాది శిక్షణ పూర్తి చేసుకున్న రాహూల్‌ను ఇటీవల బిఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా నియమించారు. కాగా కె.రాహూల్ తండ్రి రంగరాజు పోలీసు శాఖలో డిఎస్‌పిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. మంగళవారం గీతం విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కె.రాహూల్‌ను గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ అధిపతి కమాండర్ గురుమూర్తి గంగాధరన్ అభినందించారు.

కఠోర శ్రమతోనే ఉన్నత శిఖరాలకు

ఎయు ప్రొఫెసర్ మధుసూదనరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం

కఠోర శ్రమ ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎయు ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ మధుసూదనరావు విద్యార్థులకు సూచించారు. చిట్టివలస, బొగ్గురోడ్డు శ్రీకృష్ణా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫేర్‌వెల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ మధుసూదనరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంచుకున్న రంగంలో పట్టు సాధించాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల చైర్మన్ బి.నరసింగరావు మాట్లాడుతూ, ఎంచుకున్న లక్ష్యం కోసం నిరంతరం శ్రమించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరూర్ వైశ్యా బ్యాంక్ బ్రాంచి మేనేజర్ ఎ.సాయిరామ్, అసిస్టెంట్ మేనేజర్ బి.రాజేంద్ర, కళాశాల ప్రిన్సిపల్ జె.సతీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కె.చిట్టిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు



రక్తదానం చేస్తున్న గీతం బిజినెస్ స్కూల్ విద్యార్థులు

గీతం బిజినెస్ స్కూల్ విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యాన మెగా రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. గీతం బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ అమిత్‌భద్ర, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై స్వచ్ఛంద రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యపడుతుందన్నారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్-2023) యువజనోత్సవంలో భాగంగా చేపడుతున్న ముందస్తు కార్యక్రమాలను సామాజిక సేవతో ముడిపెట్టడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన రక్తదాన శిబిరానికి జెమ్-2023 సిఇఒ డాక్టర్ షంషుద్దీన్ షేక్ సంధానకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వరప్రసాద్, ప్రొఫెసర్ మంజశ్రీనాయుడు, మేనేజ్‌మెంట్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని రక్తదానం చేశారు. ఎన్‌టిఆర్ రక్త నిధి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగంలో లేని కేబుల్స్ తొలగించండి

జివిఎంసి కమిషనర్ రాజాబాబు

ప్రజాశక్తి-విశాఖపట్నం : వినియోగంలో లేని కేబుల్ వైర్లు, ఎలక్ట్రికల్ పోల్స్ తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు ఆదేశించారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఎండాడ జంక్షన్ నుంచి ఐటి సెజ్ వరకు అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జి-20 సదస్సుకు దేశ విదేశాల నుంచి అతిథులు వస్తున్నందున వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా సుందర నగరంగా తీర్చిదిద్దాలని అందుకు రోడ్లు, జీబ్రా క్రాసింగ్ లైన్స్, పారిశుధ్యం, విద్యుత్ అలంకరణ, పచ్చదనం, ఫుట్ పాత్‌ల నిర్మాణం లాంటి సుందరీకరణ పనులు నాణ్యతతో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రకటన బోర్డులు సక్రమంగా కట్టాలని, ఎండాడ చెరువుకు మరమ్మత్తులు చేపట్టి ఫుట్ పాత్ రెండు వైపులా మరమ్మత్తులు, పెయింటింగ్ వేయించాలని, భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎండాడ పరిసర ప్రాంతాలలో పారిశుధ్యం సరిగా నిర్వహించక పోవడంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే శుభ్రం చేసి డస్ట్‌బిన్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఐటి సెజ్ బిల్డింగ్ నుంచి భీమిలి బీచ్ కలిసే రోడ్డు పాడైనందున వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్, హార్టికల్చర్ డిడి ఎం.దామోదరరావు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, పర్యవేక్షక ఇంజినీర్ శ్యాంసన్‌రాజు, ఎఎంఒహెచ్ డాక్టర్ ఎన్.కిషోర్, డిసిపి పద్మజ, ఎసిపి రఘునాథరావు, డిఇ వంశీ, తదితర అధికారులు పాల్గొన్నారు.


ఎండాడలో పర్యటిస్తూ పలు సూచనలిస్తున్న జివిఎంసి కమిషనర్ రాజాబాబు


సదస్సులో ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్

సాంకేతిక సవాళ్లకు యువత సిద్ధం కావాలి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ: సాంకేతిక ప్రగతి, ఆవిష్కరణలు విసిరే సవాళ్లను స్వీకరించడానికి యువత సిద్ధంగా ఉండాలని పల్సస్ సంస్థ సిఇఒ డాక్టర్ జి.శ్రీనుబాబు అన్నారు. మంగళవారం ఏయూ అసెంబ్లీ మందిరంలో నిర్వహించిన ఫార్మసీ కళాశాల 72వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ ఫార్మసీ కళాశాల విద్యార్థిగా చేరిన నాటి నుంచి నేడు సిఇఒగా ఎదిగిన ప్రస్థానాన్ని విద్యార్థులకు వివరించారు.

ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, యువతలో ఉద్భవించే నవ్య ఆలోచనలు కార్యరూపంలో చూపాలన్నారు. విశ్రాంత ప్రిన్సిపల్ ఆచార్య కెవి.రమణమూర్తి మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఉన్న బహుళ నైపుణ్యాలను ప్రస్ఫుటం చేయడానికి, ఆర్గనైజేషనల్ స్కిల్స్ పెంచడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు జి.గిరిజాశంకర్, ఎకెఎం పవార్, కె.ఈశ్వర్‌కుమార్, ఎం.మురళీకృష్ణకుమార్, పి.శైలజ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సూర్యనారాయణ మృతి పార్టీకి తీరని లోటు : సిపిఐ

ప్రజాశక్తి -తగరపువలస : సిపిఐ నాయకులు కె సూర్యనారాయణ మృతి తీరని లోటని ఆ పార్టీ స్థానిక నాయకులు అల్లు బాబూరావు, కె.రాంబాబు, ఎం.అప్పలరాజు, ఎం.వీర్రాజు, దుంప శ్రీనివాసరావు తదితరులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. ఆయన మృతి పట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఫీజులతో సంబంధం లేకుండా..

ఇంటర్మీడియట్ హాల్ టిక్కెట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఫీజులతో సంబంధం లేకుండా ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వాలని ఎఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు కోరారు. ఈ మేరకు ఎఐఎస్ఎఫ్ ప్రతినిధి బృందం మంగళవారం జిల్లా ఆర్ఐఒ ఉమారాణిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఫీజులు చెల్లించలేదని, ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగు నీటి సదుపాయం, వాష్ రూమ్స్, అందుబాటులో ఆరోగ్య సిబ్బందిని ఉంచాలని కోరారు. వీటిపై ఆర్ఐఒ ఉమారాణి స్పందిస్తూ ఫీజులతో సంబంధం లేకుండా హాల్‌టికెట్లు జారీచేయాలని ఇప్పటికే అన్ని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలకు తగు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీను పాల్గొన్నారు.


ఆర్ఐఒకు వినతిపత్రం అందిస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానానికి సహకరించాలి


స్వచ్ఛ సంకల్పంపై అవగాహన కల్పిస్తున్న జోనల్ కమిషనర్ సింహాచలం

ప్రజాశక్తి -గాజువాక : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీ ప్రథమ స్థానంలో నిలవడానికి గాజువాక ప్రజలు సహకరించాలని జోనల్ కమిషనర్ పి.సింహాచలం కోరారు. జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి జాతీయ రహదారి నుంచి వివిఎస్‌జిహెచ్ రోడ్డులో ఉన్న బ్లూ ఎవిన్ అభిరామ్ అపార్ట్‌మెంట్స్‌లో జీవీఎంసీ ఆధ్వర్యాన స్వచ్ఛ సంకల్పంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ పి.సింహాచలం మాట్లాడుతూ, నగర ప్రజల సహకారంతో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 24వ స్థానం నుంచి 4వ స్థానానికి రావడంలో నగర ప్రజల కృషి ఎనలేదన్నారు. విశాఖ నగరంలో బహిరంగ మలమూత్ర విసర్జన 90 శాతం నివారించగలిగామని చెప్పారు. ప్లాస్టిక్ నిరోధానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. షాపుల్లో ప్లాస్టిక్ బ్యాగులకు బదులుగా గన్ని బ్యాగ్స్ వాడాలని కోరారు. ఇళ్ల వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహనాలకు తడి, పొడి చెత్తను వేరువేరుగా ఇవ్వాలని సూచించారు. ఈ ప్రాంతంలో ఉన్న ఫార్మా కంపెనీల కాలుష్యంపై పొల్యూష్యన్ కంట్రోల్ బోర్డుకు లేఖ రాస్తామని తెలిపారు. ఆస్తి, చెత్త, నీటి పన్నులు సకాలంలో కట్టి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో కాలవలు సరిగా లేవని, మురుగు నీరు నిల్వ చేరి పందులు, కుక్కలు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని తెలిపారు. డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. గాజువాక జోన్ ఎఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, పరిశుభ్రతలో అభిరామ్ అపార్ట్‌మెంట్ ఆదర్శంగా ఉంటుందన్నారు. విలీన గ్రామాల అభివృద్ధికి జీవీఎంసీ బడ్జెట్లో ఎక్కువ నిధులు కేటాయించాలని కోరారు. ఏపీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, విలీన గ్రామాల అభివృద్ధికి జీవీఎంసీ బడ్జెట్లో ఎక్కువ నిధులు కేటాయించాలని కోరారు.

బ్లూ ఎవిన్ అభిరామ్ అపార్ట్‌మెంట్స్ నివాసుల సంక్షేమ సంఘం గౌరవ కార్యదర్శి ఎన్.చంద్రశేఖరరావు అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో 79వ వార్డు టిడిపి కార్యదర్శి బొబ్బరి సూర్య, టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు సింగిడి సింహాచలం, 6వ జోన్ ఎస్ఎస్ బివి.రామారావు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.నగేష్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉచిత ఉపకరణాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సామాజిక బాధ్యతలో భాగంగా విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు అగర్వాల్ మహాసభ విశాఖ అధ్యక్షులు విజయేంద్ర కుమార్‌గుప్తా తెలిపారు. మహారాణిపేటలోని రాజస్థాన్ సాంస్కృతిక మండలి భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఉపకరణాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ చేపడుతున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది తొలి అంశంగా వీల్ చైర్లు, వాకర్స్, స్టిక్స్, ఊత కర్రలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రోగ్రాం చైర్మన్ ప్రకాష్ సరోగి మాట్లాడుతూ భవిష్యత్తులో శాశ్వత ప్రాతిపదికన ఇటువంటి కార్యక్రమాలను చేపట్టాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కో-చైర్మన్ అగర్వాల్ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా తమ సంస్థ విశాఖ నగరంలో ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టిందన్నారు. అదే స్ఫూర్తితో రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి,ప్రకాశం, గుంటూరు, హైదరాబాద్ వంటి సుదీర్ఘ ప్రాంతాల నుంచి వచ్చిన లబ్ధిదారులకు ఉపకరణాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. 98 సంవత్సరాల మహిళ, నాలుగేళ్ల బాలిక లబ్ధిదారులలో ఉన్నారని పేర్కొన్నారు. 290 మందికి వీల్ చైర్లు, వాకర్, వాకింగ్ స్టిక్స్, ఊత కర్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పవన్ కుమార్ కన్నా రియా, సంజయ్ కానొడియ, రాజేష్ అగర్వాల్, సంజయ్ అగర్వాల్, మహాసభ కార్యదర్శి దేవకి నందన్ అమన్ గార్గ్, విష్ణు పచేరియ, ఎన్ఎన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఉచిత ఉపకరణాలు అందుకున్న విభిన్న ప్రతిభావంతులతో అగర్వాల్ మహాసభ ప్రతినిధులు

వేడుకగా ముత్యాలమ్మ పండగ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు నక్కవానిపాలెం ఏడుగుడుల గ్రామ దేవత ముత్యాలమ్మ పండుగను గ్రామ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు వెంకటరెడ్డి తెలిపారు. ఈ పండుగ మహోత్సవంలో గ్రామ కమిటీ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రోబోటిక్స్‌లో ఎయు స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పూణేలోని శ్రీశివ ఛత్రపతి శివాజీ స్టేడియంలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించిన ఎఫ్‌టీసీ రోబోటిక్స్ స్టెమ్ టెక్నాలజీ టోర్నమెంట్‌లో ఆంధ్రాయూనివర్సిటీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 60 జాతీయ, 11 అంతర్జాతీయ జట్లు ఇందులో పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎయు స్కూల్ (కొత్త జట్టు) మొదటిసారి పూణె, చెన్నై, గుజరాత్, వర్ధమాన్ వంటి ఇతర రాష్ట్రాల జట్లతో, ఇజ్రాయిల్, రొమేనియా వంటి అంతర్జాతీయ జట్లతో పోటీపడింది. 71 జట్లలో ఆంధ్రా అచీవర్స్ జట్టు 28వ స్థానంలో నిలిచింది. ఏయూ జట్టుకు స్టెమ్ యంగ్ అచీవర్ అవార్డును అందజేశారు. ఎయు ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు రోబోటిక్స్‌లో ఎన్ఆర్ఐలు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ఎ రహమాన్, శిరీన్ రహమాన్ దంపతుల తనయులు సమీర్ షేక్, సంతోష్ ఆన్‌లైన్‌లో శిక్షణతో పాటు పిల్లలకు కావలసిన వనరులన్నింటినీ సమకూర్చారు. ఈ ఘనత సాధించిన పిల్లలను చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ శిరీన్ రహమాన్ అభినందించారు.


రోబోటిక్స్‌లో ప్రతిభ చూపిన ఎయు ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు

సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

135వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

ఎన్ఎఓబి నిర్మాణం కారణంగా సర్వం కోల్పోయిన నిర్వాసితుల సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పరిష్కరించాలని నేవీ నిర్వాసిత జెఎసి పెద్దలు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఓబి ప్రధాన గేట్ ముందు నేవీ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన 135వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జెఎసి పెద్దలు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ నావికా స్థావరం నిర్మాణం వల్ల సర్వం కోల్పోయిన తమతో ప్రభుత్వం, నేవీ అధికారులు చేసుకున్న ఒప్పందాలు మేరకు న్యాయం చేయాలని కోరారు. నేవీ నిర్మాణంతో సముద్రంలో చేపల వేట సాగక తమ ఉపాధి పోయిందని, తమ కుటుంబాల జీవనం సాగడం లేదని వాపోయారు. తమకు జీవన భృతి కల్పించాలని, జెట్టీ నిర్మాణం చేపట్టాలని, అంత వరకు నేవీ గేట్ లోపల నుంచి ఆధార్ కార్డు ఆధారంగా చేపల వేటకు అనుమతి ఇవ్వాలని, పెండింగ్ ప్యాకేజీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు



అమ్మవారికి పూజ చేస్తున్న మాజీ మంత్రి బండారు

వైభవంగా పరదేశిమాంబ జాతర

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని భరణికం గ్రామ ప్రజల ఇలవేల్పు శ్రీ పరదేశిమాంబ జాతర మహోత్సవం మంగళవారం స్థానిక సర్పంచి పెదిశెట్టి పూజశేఖర్, ఉత్సవ కమిటీ పెద్దల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సర్పంచి పూజశేఖర్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు, చీరసారెలు సమర్పించి తొలిపూజ చేశారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్యూలైన్లలో నిలబడి పరదేశిమాంబను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో యూత్ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీల్లో విజేతలకు సర్పంచి, ఇతర పెద్దల చేతుల మీదగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మాస అప్పలనాయుడు, మాజీ జెడ్పిటిసి జగన్నాధరావు, యువకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈ నెల 15 నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రవి పటాన్ శెట్టి మంగళవారం ఒక ప్రకటనలో అధికారులను ఆదేశించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ పరీక్షలకు విద్యార్థులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన మంచినీరు, పరీక్ష కేంద్రాల్లో విద్యుత్తు సరఫరా చేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన రోడ్లలో బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. అధికారులు పటిష్టమైన ప్రణాళికతో ఈ పరీక్షలు నిర్వహించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు.

ఆన్‌లైన్ మోసాలు, అశ్లీలతను నియంత్రించాలి



మాట్లాడుతున్న ఎఐవైఎఫ్ నాయకులు కన్నబాబు, రాజు

ప్రజాశక్తి- అనకాపల్లి

యువతే లక్ష్యంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వేదికలుగా జరుగుతున్న బూతు పురాణాలు, ఆన్‌లైన్ మోసాలను నియంత్రించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేముల కన్నబాబు, వియ్యపు రాజు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సోషల్ మీడియాలో రోజురోజుకు ఆన్లైన్ మోసాలు పెరుగుతున్నాయన్నారు. అశ్లీలత, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతుందని పేర్కొన్నారు. ఫేసేబుక్ బూతు బుక్కుగా తయారైందన్నారు. దీంతో యువత పెడతోవ పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని నియంత్రించాల్సిన ప్రభుత్వాలు, అధికారులు కళ్ళుండి చూడలేని వారుగా తయారయ్యారని విమర్శించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సాయి, తరుణ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 97.3 శాతం ఈ-పంట నమోదు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో 2022-23 రబీ సీజన్లో 43,116 ఎకరాల్లో ఈకేవైసీ, ఈ-పంట నమోదు 97.3 శాతం పూర్తయినట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్ రావు తెలిపారు. మండలంలోని వెంకుపాలెం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ -పంట నమోదు గడువును రెండుసార్లు పెంచిందని తెలిపారు. దీంతో 97.3 నమోదు చేసి ఈనెల 10న రైతు భరోసా కేంద్రాల వద్ద ముసాయిదా జాబితాలను పెట్టడం జరిగిందని చెప్పారు. వీటిపై ఈనెల 13 నుంచి 17 వరకు సామాజిక తనిఖీ ఉంటుందని, అనంతరం గ్రామసభలు నిర్వహించి రైతుల వివరాలను తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ముసాయిదా జాబితాలను పరిశీలించి సవరణలు ఉంటే తమ సమీపంలో రైతు భరోసా కేంద్రంలో విఏఏ, విహెచ్ఏ, విఎస్ఏలను సంప్రదించాలని సూచించారు. అనంతరం తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ డాక్టర్ హేమంత్

పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హేమంత్

ప్రజాశక్తి- కశింకోట

పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హేమంత్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ వారోత్సవాలు సందర్భంగా కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం నులి పురుగులు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. గ్రామాల్లో వైద్య సేవలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కశింకోట వైద్య అధికారులు తిరుపతిరావు, యశోద పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక భీముని గుమ్మం జీవీఎంసీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఎలమంచిలి ఉపవిద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధర్మారావు, ఎంఈఓ దివాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.

17న నూకాంబిక ఉత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీనూకాంబిక అమ్మవారి ఊరేగింపు మహోత్సవం ఈ నెల 17న ఘనంగా నిర్వహించనున్నట్లు అమ్మవారి మాలధారణ సంఘ వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను తెలిపారు. దాడి వీరభద్రరావు స్వగృహంలో మంగళవారం ఆయన చేతుల మీదుగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శతకం పట్టు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ పి బాబీ, సిలపరశెట్టి బాబీ, మల్ల గణేష్, సూరిశెట్టి శ్రీను, కొలపర్తి శ్రీను, సూరిశెట్టి హృదయ్ అక్షయ్, రాజు, పవన్, కృప సాగర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి దాడి తదితరులు

కెజిబివి విద్యార్థినులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలో రైవాడ కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ఎగ్జామ్ ప్యాడ్‌లు, పెన్నులు, కాంపస్ బాక్సులు, ఇతర పరీక్షా సంబంధిత మెటీరియల్‌ను ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యాన మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాలలో మంగళవారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు కొర్రప్రోలు శ్రీను ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కెవి.రమణ వీటిని విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ దాతలు సహాయంతో వీటిని అందజేసినట్లు చెప్పారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, పరీక్ష సమయంలో ఎవరు డిప్రెషన్‌కు లోను కాకూడదని సూచించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక తరపున ప్రోత్సాహకంగా 10 పాయింట్స్ వచ్చిన వాళ్లకు రూ.10వేలు చొప్పున, 9.5 పాయింట్స్ సాధించిన విద్యార్థులకు రూ.5వేలు చొప్పున ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ శశి, ఉపాధ్యాయులు రండి వెంకట్రావు, ఉప్పు అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.



మెటీరియల్ పంపిణీ చేస్తున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ప్రతినిధులు

భర్త హత్యాయత్నంలో గాయపడిన భార్య మృతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

భర్త ఇనుప రాడ్డులో తలపై కొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన భార్య చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని ఆర్.శివరాంపురం గ్రామానికి చెందిన చందక నూకరాజుకు అదే గ్రామానికి చెందిన లత (28)తో 2019లో వివాహం జరిగింది. నూకరాజు కందిపూడి సమీపంలోని ఒక ప్రైవేట్ స్థలంలో డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్నాడు. నూకరాజు, లత ఏడాది పాటు అన్యోన్యంగా ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. భార్యను అనుమానిస్తూ నూకరాజు తరచూ గొడవలకు దిగుతూ ఆమెను వేధిస్తూ ఉండేవాడు. ఈ నెల 12న ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో కందిపూడి డెయిరీ ఫామ్ వద్ద భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో భర్త నూకరాజు ఇనుప రాడ్డుతో భార్య లత తలపై తీవ్రంగా కొట్టారు. దీంతో లత తీవ్రంగా గాయపడింది. ఇది గమనించిన స్థానికులు లత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన వచ్చిన లతను విశాఖపట్నం కెజిహెచ్ తరలించి వైద్యం అందించారు. పరిస్థితి విషమించి సోమవారం సాయంత్రం కెజిహెచ్‌లో లత మృతి చెందింది. నిందితుడు నూకరాజును పోలీసులు అరెస్టు చేశారు. లత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.కుమారస్వామి తెలిపారు.



లత (ఫైల్‌ఫొటో)



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

శ్రీకృష్ణ, రుక్మిణిల విగ్రహాలు ఊరేగింపు

ప్రజాశక్తి -అనకాపల్లి

గవరపాలెం శ్రీకృష్ణ మందిరంలో హరే కృష్ణ హరే రామ సప్తాహం వంద రోజులు పూర్తయిన నేపథ్యంలో కొత్ర కనకరాజు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రుక్మిణిల విగ్రహాలను మంగళవారం పురవీధుల్లో ఊరేగించారు. ముందుగా శ్రీకృష్ణ రుక్మిణిల విగ్రహాలకు పంచభిషేకాలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం అధ్యక్షులు బొడ్డేడ సన్యాసి రావు, కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి శివ సూర్యనారాయణ, శ్రీ గౌరీ గీత మహిళా సంఘం అధ్యక్షురాలు వేగి సత్యవతి, కార్యదర్శి ఆడారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆపన్న హస్తం అందించరూ..

ప్రజాశక్తి-విఆర్.పురం

పదేళ్ల వయస్సు లోపే మెదడు సంబంధిత వ్యాధికి రెండు ఆపరేషన్లు. ఆపై ఫిట్స్ వచ్చింది. ఇలా ఉండగానే అరుదైన చర్మవ్యాధికి గురయ్యాడు. ప్రస్తుతం బోనకల్ మేఘశ్రీ ఆసుతపత్రిలో చికిత్స పొందుతున్న ప్రసన్న రత్నం అనే బాలుడికి వైద్యం అందించేందుకు తల్లిదండ్రులు ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి...



ప్రసన్న రత్నంకు చర్మం ఊడిపోయి రక్తం కారుతున్న దృశ్యం

అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్.పురం మండలం రేఖపల్లి గ్రామానికి చెందిన యు.కరుణాకర్ అటవీశాఖలో చిరు ఉద్యోగి. ఆయన కుమారుడు 12 ఏళ్ల ప్రసన్న రత్నంకు చిన్నతనంలోనే మెదడు సంబంధిత వ్యాధి సోకింది. రెండు సార్లు ఆపరేషన్లు చేశారు. అప్పటి నుంచి ప్రతి రోజూ మందులు వాడుతున్నారు. పదేళ్ల లోపే రెండు సార్లు మెదడు సంబంధిత ఆపరేషన్లు జరగడంతో ఫిట్స్ వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. తమిళనాడులోని రాయవెల్లూరు ఆసుపత్రిలో కూడా వైద్యం చేయించారు. ఫిట్స్‌తో ఇబ్బందులు పడుతుండగానే అరుదైన చర్మవ్యాధికి గురయ్యాడు. గడిచిన ఐదు నెలల నుంచి తీవ్రమైన జ్వరం, కామెర్లు, దగ్గు, నోటిపూత మొదలయ్యాయి. దురద రావడం, ఆ తర్వాత చర్మం ఊడిపోయి లోపల కండరాలు బయటకు కనిపించడం, నిరంతరం రక్తస్రావం కావడం జరుగుతుంది. ముఖం, ఛాతి, వీపు భాగంలో చర్మం పూర్తిగా ఊడిపోయి బాలుడికి ఏం జరుగుతుందో తెలియక ప్రసన్న రత్నం తల్లితండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. నిరంతరాయంగా మందులు వాడుతుండడంతో "స్టీఫెన్ జాన్సన్ సిండ్రోమ్" అనే వ్యాధి సోకిందని చర్మ వైద్యులు చెబుతున్నారు. అది కూడా పూర్తిగా ధ్రువీకరించడం లేదు. బాలుడి పరిస్థితి దయనీయంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో పలు ఆసుపత్రుల్లో చేర్చుకోవడానికి కూడా ముందుకు రావడం లేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రసన్న రత్నానికి వైద్య సాయం అందించాలని ఆ కుటుంబం కోరుతోంది. అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడికి వైద్యం అందించడం చాలా ఖరీదుతో కూడుకున్నది. ఇప్పటికే ఆ కుటుంబం బాలుని వైద్యానికి పెద్ద మొత్తంలో ఖర్చు చేసి అప్పుల పాలైంది. ప్రభుత్వం, దాతలు ముందుకొచ్చి తమ కుమారుడి వైద్యానికి ఆర్థిక సాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఆర్థిక సాయం అందించదల్చుకున్న వారు 9440326777 నెంబర్‌కు ఫోన్‌పే (యు.కరుణాకర్), లేదంటే యు.ప్రసన్న రత్నం, అకౌంట్ నెంబర్ 41745462362, ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్0020680 బ్యాంకు అకౌంట్‌కు అందించవలసిందిగా కోరుతున్నారు.

రూ.32 లక్షలతో సబ్ స్టేషన్‌లో మరమ్మతులు

ప్రజాశక్తి-సబ్బవరం

మండల కేంద్రంలోని 33/11కెవి సబ్ స్టేషన్‌లో రూ.32 లక్షలతో మరమ్మతులు చేపట్టినట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి. సురేష్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ సబ్ స్టేషన్‌లో చాలా కాలంగా మరమ్మతులకు గురైన నాలుగు పాత బ్రేకర్స్ స్థానంలో కొత్తవి బ్రేకర్స్‌ను అమర్చినట్లు చెప్పారు. రూ.32 లక్షలతో మరింత నాణ్యతమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పునరుద్ధరించడం జరిగిందని పేర్కొన్నారు. చోడవరం డిఈఈ యుకె. గౌరీ ప్రసాద్, ప్రొటెక్షన్ డిఈఈ ఎం.సత్యారావు, కె.కోటపాడు ఎఈఈ, ఎం.చంద్రశేఖర్ సహకారంతో ఈ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం డి1 ఎఈఈ జి.అశోక్ కుమార్, సబ్బవరం డి2 ఎఈఈ బి.వీరేంద్ర పాల్గొన్నారు.



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది



పైపులైన్‌కు రింగ్ అమర్చుతున్న సిబ్బంది

నీటి సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని తాళ్లపాలెంలో పైపులైన్‌కు మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. తాళ్లపాలెంలో మంచి నీటి పైపులైన్ వద్ద లింక్ విరిగి పోయింది. పగిలి లింక్ గొట్టం వద్ద మంగళవారం రింగ్ అమర్చి నీటి సరఫరా యథావిధిగా సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నూకాలమ్మ పండగకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రం సమీపంలో వెలసిన నూకాలమ్మ అమ్మవారి పండగను వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఈనెల 19వ తేదీన సాయంత్రం అమ్మవారి సన్నిధిలో గరగా అలంకరణ చేసి పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు జరుగుతుంది. 20న కుంకుమార్చన పూజలు నిర్వహిస్తారు. 21న కొత్త అమావాస్య సందర్భంగా నూకాలమ్మ ఆలయంలో ప్రధాన పండగ జరుగుతుంది. అదే రోజు 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని భక్తుల ఆర్థిక సహాయంతో కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. 22న భక్తుల గోత్రనామాలతో నిత్య పూజలు నిర్వహిస్తారు. 23న మారు పూజ నిర్వహిస్తారు. భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు

నేటి నుంచి ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు ఈనెల 15 నుంచి 17 వరకు డివిజన్ల వారీగా ఉపకరణాలు పంపిణీ చేస్తామని, వైద్య గుర్తింపు నిర్ధారణ శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి, ఎక్స్ అఫీషియో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఎం.వెంకట లక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 24 మండలాల్లో 18 సంవత్సరాలలోపు ప్రత్యేక అవసరాల గల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వీరికి వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, సిపి చైర్లు, వినికిడి యంత్రాలు, బ్రెయిలీ కిట్లు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈనెల 15న అనకాపల్లి ఉడ్పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో మెడికల్ అసెస్మెంట్ క్యాంపు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ క్యాంపునకు అనకాపల్లి, కశింకోట, పరవాడ, మునగపాక, అచ్యుతాపురం, ఎలమంచిలి, రాంబిల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట, నక్కపల్లి మండలాలకు చెందిన వారు హాజరు కావాలని సూచించారు. 16న చోడవరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగు శిబిరానికి చోడవరం, దేవరాపల్లి, చీడికాడ, సబ్బవరం, బుచ్చయ్యపేట, వి మాడుగుల, కె.కోటపాడు మండలాలకు చెందినవారు, 17వ తేదీన నర్సీపట్నం జిల్లా పరిషత్ మెయిన్ ఉన్నత పాఠశాలలో జరుగు గుర్తింపు నిర్ధారణ శిబిరానికి నర్సీపట్నం, రోలుగుంట, రావికమతం, కోటవురట్ల, మాకవరపాలెం, నాతవరం, గొలుగొండ మండలాలకు చెందినవారు హాజరు కావాలని కోరారు. ఈ శిబిరాలకు హాజరయ్యే ప్రత్యేక అవసరాల పిల్లలు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకువాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో అధికారులు విఫలం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించడంలో ఎన్నికల కమిషన్, అనకాపల్లి జిల్లా ఎన్నికల అధికారులు పూర్తిగా విఫలమయ్యారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల్లో 37 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని తెలిసినా ఓటర్లకు కావలసిన ఏర్పాట్లు చేయకపోవడంతో గంటల తరబడి ఎండలో నిలబడి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. వారికి కావలసిన కనీస మంచినీరు కూడా కల్పించలేదన్నారు. దీంతో పలువురు తమ ఓటు హక్కు వినియోగించకుండానే వెనుతిరిగారన్నారు. రాత్రి 7 గంటల వరకు పోలింగ్ జరగడంతో లైటింగ్ సదుపాయం కూడా లేదన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఓటర్ల నమోదు కార్యక్రమం నుంచి ఎన్నికలు ముగిసే వరకు అధికారులు వైసిపి నేతల కనుసన్నల్లోనే పనిచేశారని ఆరోపించారు. జిల్లాకు సంబంధం లేని వారిని బయటకు పంపాలని చెప్పి చిత్తూరు జిల్లాలో యువగళం నిర్వహిస్తున్న లోకేష్‌ను పంపిన అధికారులు, విశాఖలో వైవి సుబ్బారెడ్డిని ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. ఎన్నికల్లో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది చేత ఓటుకు రూ.1000 నుండి రూ.5 వేలు, వెండి కాయిన్స్ పంపిణీ చేసి ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేశారని విమర్శించారు. పంచాయతీ ఎన్నికల దగ్గర నుంచి వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న దురాగతాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. దీనిని తిప్పికొట్టేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఐక్యమై ఎన్నికల కమిషన్‌పై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నిర్బంధం నడుమ జీడితోట వేలం

- దళితుల పొట్ట కొట్టొద్దని సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన
- పోలీసు పహారాలో తలుపు మూసేసి వేలం నిర్వహణ
- అడ్డుకున్న ఆందోళనకారులను ఈడ్చేసిన పోలీసులు
- వాగ్వాదం, తోపులాటలతో ఆద్యంతం ఉద్రిక్తత



తహశీల్దార్ కార్యాలయం గేటు వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలోని గునుపూడి శివారు బంగారమ్మపేట గ్రామంలోని జీడితోటలు ఫలసాయానికి మంగళవారం నిర్వహించిన వేలం ఆద్యంతం ఉద్రిక్త వాతావరణంలో నిర్బంధం నడుమ నిర్వహించారు. ల్యాండ్ సీలింగ్ కింద తమకు ఇచ్చిన భూములు, తమ అధీనంలో ఉండివాటి ఫలసాయంతో ఇన్నాళ్లు జీవనోపాధి పొందుతున్న పరిస్థితుల్లో ఆ తోటలను వేలం వేసి ఉపాధికి హరించొద్దని వేడుకున్నారు. దీంతో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణంలో వాగ్వాదాలు, తోపులాటలు, పోలీస్ పహారా నడుమ అధికారులు వేలంపాట నిర్వహించారు.

మండలంలోని గునుపూడి శివారు బంగారమ్మపేట గ్రామం సర్వే నెం. 195, 196, 197లో 70 ఎకరాలు విస్తీర్ణంలోగల జీడితోటలో జీడిపిక్కల ఫలసాయాన్నిఈ ఏడాది తీసుకొనుటకు మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వేలంపాటలో నర్సీపట్నం ఆర్‌డిఒ జయరాం పాల్గొన్నారు.. కాగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో గునుపూడి గ్రామానికి చెందిన దళితులు, వెనుకబడిన తరగతులకు చెందిన వారు వేలం పాట రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ముందుగా ఆర్‌డిఒ, తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వేలంపాటను నిలుపుదల చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.అయితే కలెక్టర్ ఆదేశాల మేరకు వేలంపాట నిర్వహిస్తామని, సమస్యను కలెక్టర్‌కు నివేదిస్తామని ఆర్‌డిఒ, ఇతర అధికారులు స్పష్టం చేయడంతో ఆందోళనకారులు కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేపట్టారు. గునుపూడి సర్వే నెంబరు. 196,196/8,202/9 లలో సుమారుగా 38 ఎకరాలను 19 కుటుంబాలకు 1976లోనే ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ ద్వారా పట్టాలిచ్చిందని, నాటి నుంచి ఆ భూములపై ఆధారపడి జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీడితోటల ఫలసాయం తమకే దక్కాలని, వేలం పాట రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. దీనిపై ఇప్పటికే అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా, పదేపదే వేలం వేసేందుకు రావడం అన్యాయమని ఆవేదన వెలిబుచ్చారు. వేలం పాట నిర్వహించకూడదని పెద్ద పెట్టున నినాదాలు చేసారు. వేలం పాటలో పాల్గొనేందుకు వచ్చిన వారిని కార్యాలయంలోకి వెళ్లకుండా ఆందోళనకారులు బైఠాయించారు.

ఎస్ఐ శిరీష సిబ్బందితో కలిసి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆందోళనకారులను సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినకుండా, వేలంపాటను అడ్డుకుని తీరతామని స్పష్టం చేయడంతో ఎస్ఐ శిరీష ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళనకారులను బలవంతంగా బయటకు లాగేసి వేలంపాటదారులను కార్యాలయంలోకి పంపించారు. తహశీల్దార్ కార్యాలయంలో, తలుపుగడియ పెట్టుకుని అధికారులు వేలం పాటను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆందోళనకారులు, పోలీసులు మధ్య తోపులాటలు, వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు, పోలీసుల తీరును నిరసిస్తూ ఆందోళనకారులు తలుపు వద్ద బైఠాయించి పెద్దపెట్టున నినాదాలు చేసారు. వేలం పాట పూర్తయిన తర్వాత ఆర్డీవో జయరాం బయటకు వస్తుండగా ఆందోళనకారులు అడ్డుతగిలారు. కారు ముందు బైఠాయించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆర్‌డిఒ వెళ్లిన తర్వాత కూడా అధికారులు ,పోలీసులు తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



బాధితులు, సిపిఎం నేతలను పక్కకు తోసేస్తున్న పోలీసులు

రూ.10.70 లక్షలకు వేలం పాట ఖరారు

నర్సీపట్నం ఆర్‌డిఒ జయరాం సమక్షంలో నిర్వహించిన వేలంపాటలో ఈ ఏడాదికి జీడితోట పిక్కల ఫలసాయం పొందేందుకు బంగారమ్మ పేట గ్రామానికి చెందిన కొవిరి రమణ రూ.10.70లక్షలకు దక్కించుకున్నారని ఇన్‌ఛార్జి తహశీల్దార్ నీరజ తెలిపారు. వేలం పాట ఖరారు చేసినట్లు వెల్లడించారు.

దౌర్జన్యంగా వేలం పాట : సిపిఎం

దళితుల నోరు నొక్కి దౌర్జన్యంగా వేలంపాట నిర్వహించడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు విమర్శించారు. వేలం పాటదారులతో రెవెన్యూ అధికారులు, పోలీసులు కుమ్మక్కై, దళితులపై దౌర్జన్యం చేసి వారి పొట్ట కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి నిబంధనలుకు విరుద్ధంగా, నిర్బంధంతో నిర్వహించిన జీడితోటల వేలం పాటను రద్దు చేయాలని గూనుపూడిలో గతంలో పట్టాలు పొంది 19 కుటుంబాలకు 38 ఎకరాలు అప్పజెప్పి,మిగతా 22 ఎకరాలను బంగారమ్మపేటలో పేదలకు ఇళ్లపట్టాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు కార్యక్రమంలో వాతాడ అప్పారావు, గంటా చిన్నారావు, మాసా జోగారావు,మాసా అప్పారావు, పల్లా అప్పారావు, అయినంపూడి శ్రీను, గాలింక లోవమ్మ, మాసా పెద్ద అప్పియ్యమ్మ పాల్గొన్నారు.

జీడితోట దగ్ధం



దగ్ధమైన జీడితోటను చూపుతున్న బాధిత రైతులు

ప్రజాశక్తి- కోటవురట్ల : ఆశాజనకంగా ఉన్న జీడితోట దగ్ధం కావడంతో రైతన్న కుటుంబం రోదిస్తోంది. మండలంలోని జి కొత్తపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి కొల్లి అప్పలనాయుడు, కొల్లి వరలక్ష్మిలకు చెందిన సుమారు నాలుగున్నర ఎకరాల జీడి తోట మంగళవారం సాయంత్రం అగ్నికి ఆహుతైంది. అయింది. ప్రస్తుతం పూత దశలో ఉన్న తోట అగ్నిప్రమాదంలో కాలిపోవడంతో పంట చేతికి దక్కకపోవడంతోపాటు కొన్ని చెట్లకు నష్టం వాటిల్లక తప్పదని రైతు కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు. తోటలో మంటలు ఎలా అంటుకున్నాయో? ప్రమాదానికి కారణం ఏమిటో అంతుపట్టడం లేదని బాధిత రైతు ఆవేదన వ్యక్తపరిచారు. ఈ విషయం గ్రామ రెవెన్యూ అధికారికి తెలియజేయగా అధికారి వచ్చి దగ్ధమైన జీడి తోటను పరిశీలించారు దీనిపై తహశీల్దార్‌తోపాటు ఉన్నతాధికారులకు నివేదిస్తానని విఆర్ఒ తెలిపారు. దీనిపై తహసీల్దార్ బివి రాణిని వివరణ కోరగా ఉద్యానవన శాఖ అధికారిని పంపించి పంటనష్టం అంచనా వేయిస్తామని, దాన్ని కలెక్టర్‌కు నివేదించి, వారి సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

పశువుల వ్యాన్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న వ్యాన్‌లో ఉన్న ఆవులు

ప్రజాశక్తి - నక్కపల్లి : ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువుల వ్యానును పట్టుకున్నట్లు ఎస్ఐ శిరీష తెలిపారు.కాగిత టోల్గేట్ వద్ద మంగళవారం తనిఖీలు నిర్వహిస్తుండగా, వ్యాన్ లో అక్రమంగా తరలిస్తున్న 53 పశువులను పట్టుకున్నట్లు తెలిపారు. వ్యాన్ సీజ్ చేసి, పశువులను గోశాలకు పంపించమన్నారు .ఒడిస్సాలో పశువుల అమ్మిన మస్తాన్, వాహన డ్రైవర్ రామావత్ గోపాల్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు .

గ్రావెల్ ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు.పెదబోదిగల్లం మార్గంలో మంగళవారం గస్తీ నిర్వహించగా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించమన్నారు. అనుమతులు లేకుండా గ్రావెల్, ఇసుక తరలిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు .



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్

ఒంటిపూట బడులు నిర్వహించాలి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరరావు

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి మహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏటా మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించడం సంప్రదాయబద్ధంగా గత అర్థ శతాబ్ద కాలంగా కొనసాగుతోందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, శ్రేయస్సును పరిగణనలోకి తీసుకొని, విద్యాలయాల్లో ఒంటిపూడ బడుల నిర్వహణపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకుని ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కౌన్సిలర్లు ఎస్.కన్నయ్య, కె.రఘునాథ్, స్థానిక మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్ నారాయణ, ఎస్ బాలకృష్ణ, జి దుక్కు, ఆనంద్, మోహన్, మేఘనాథ్ పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు మనబాలవాని పాలెం వద్ద కోడిపందేల శిబిరంపై మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో ముగ్గురును అరెస్టు చేసి, వారి వద్ద నుండి మూడు కోళ్ళు, రూ.900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శిరీష తెలిపారు.అన్ని గ్రామాల్లోని నిరంతరం గస్తీ నిర్వహించడం జరుగుతుందని ,పేకాట, కోడిపందేలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు .

'స్పందన' చర్యలపై అసంతృప్తి



అనాధీన భూమిని చూపిస్తున్న ఫిర్యాదుదారుడు

ప్రజాశక్తి -కోటవురట్ల : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ఇచ్చిన అర్జీలపై అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ఎండపల్లి గ్రామానికి చెందిన గొర్లఅప్పలనాయుడు (నాని) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఎండపల్లి గ్రామంలో ప్రభుత్వ అనాధీనం భూమిలో ప్రైవేటు వ్యక్తులు లేఅవుట్లు వేస్తున్నారని, దీనిపై జనవరి 9న అనకాపల్లిజిల్లా కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేశానని అంటున్నాడు. ఎఎన్‌పిఎల్ 202301092174 నెంబరుతో తాను ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు తూతూమంత్రంగా విచారణ చేపట్టిన అధికారులు సమస్య పరిష్కరించినట్లు మెసేజ్ పంపించారని అంటున్నాడు. సమస్య పరిష్కారం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఫిబ్రవరి 27న మరో మారు ఫిర్యాదు చేసానని అంటున్నాడు

ఎండపల్లి గ్రామం సర్వే నంబర్ 31/3 లో 0.83 ఎకరాల అనాధీనంగా చూపిస్తున్న భూమిలో,కొండ పోరంబోకు భూమి 81 ఎకరాల కాగా అందులో 0.51 ఎకరాల భూమిని సమీపంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు లేఔట్‌లో కలిపారనేది ఫిర్యాదుదారుని ఆరోపణ. ఈ విషయమై స్థానిక తహశీల్దారు జానకమ్మను వివరణ కోరగా అనాధీనం కొండపోరంబోకు భూమి ఉన్నమాట వాస్తవమేని, ప్రైవేటు లేఅవుట్‌లో భూమి ఆక్రమణ కాకుండా చర్యలు చేపట్టామన్నారు. అనాధీన భూమిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పిల్లల హక్కులకు భంగం కలిగిస్తే సహించం

- ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్
- ప్రభుత్వ మానసిక వైద్యశాలలో అరకొర సదుపాయాలపై సీరియస్



మానసిక వైద్యశాల పరిస్థితులపై ప్రశ్నిస్తున్న కమిషన్ అధ్యక్షుడు అప్పారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పిల్లల హక్కులకు, వారి సంక్షేమానికి భంగం కలిగించే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం అన్నారు. మంగళవారం చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాలను వారు ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో 18 ఏళ్లలోపు బాలలు మానసికంగా ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిశీలించేందుకు చిన్న పిల్లల వార్డుల్లో కలియదిరిగారు. సౌకర్యాలపై ఆరా తీశారు. భోజన వసతులు, శుచీ, శుభ్రతలపై సూపరింటెండెంట్ హరికృష్ణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒపి విభాగంలో నమోదైన చిన్న పిల్లలకు సంబంధించిన కేసుల రికార్డులు పరిశీలించారు. అనంతరం అప్పారావు, సీతారాం మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు బాలలకు ప్రత్యేకించి ఒక విభాగం కేటాయించి వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. వివిధ మానసిక వ్యాధులతో చికిత్స పొందుతున్న వారితో కలిపి ఎట్టి పరిస్థితుల్లోనూ చికిత్స అందించవద్దని ఆదేశాలు జారీ చేశారు. అనుభవిజ్ఞులైన వైద్యుల పరిశీలనలో త్వరితగతిన కోలుకునేలా నిర్విరామ వైద్యం అందేలా చర్యలు చేపట్టాలన్నారు.

రికార్డులేవీ ?

బాలలకు సంబంధించి పూర్తి స్థాయి రికార్డులు నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ అందుబాటులో ఫిర్యాదుల పెట్టె ఉండాల్సింది పోయి మారుమూల ప్రాంతంలో అమర్చడంపై ప్రశ్నించారు. వైద్యం పొందుతున్న చిన్నారులు భోజనం, టిఫిన్లలో నాణ్యతా ప్రమాణాలు లేవని, మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందడం లేదని, కాంట్రాక్టర్ అరకొరగా అందిస్తున్నారని తమ దృష్టికి తెచ్చినట్టు వారు తెలిపారు. తక్షణమే కాంట్రాక్టర్‌కు మెమో జారీచేయాలని ఆదేశించినట్టు చెప్పారు. అవసరమైతే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టేందుకు సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. వారి వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ హరికృష్ణ, సిఎస్ఆర్ఎంఒ హైమావతి, విజయనగరం జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి అల్లు సత్యనారాయణ ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -కొత్తకోట : ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి జిల్లాల అండర్-19 జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు అనకాపల్లి జిల్లా రావికమతం మండలం టి అర్జాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెల 18న ఎంపికైన మత్స భాగ్యశ్రీ, మలిచెట్ల భీష్మ నందిని, కలిగిరి భాగ్యలక్ష్మి, మరిశా కుమార్, ఆరి క్రాంతి, పడాల సాంబశివ తదితర విద్యార్థులు ఈ నెల 16,17,18 తేదీలలో నెల్లూరు జిల్లా కావలిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పిడి కె.రమేష్ నాయుడు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం కెఆరఎస్.నాయుడు, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు ఎం.శివయ్య,నాయుడు సిఆర్‌పి గుంటూరు రామారావు, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానికులతోపాటు తోటి విద్యార్థులలు అభినందించి, రాష్ట్రపోటీల్లోనూ రాణించి పతకాలతో రావాలని ఆకాంక్షించారు.

వాలీబాల్‌లో మాడుగుల యువకుని ప్రతిభ



బహుమతితో వెంకటేష్

ప్రజాశక్తి- మాడుగుల : వాలీబాల్ పోటీల్లో మాడుగుల మండలం జాలంపల్లి గ్రామానికి చెందిన గొం ప వెంకటేష్ విశేషంగా రాణిస్తూ జాతీయస్థాయిలోనూ ప్రతిభ చూపుతున్నాడు. ఇతని తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం విజయవాడలో వుండగా, అక్కడి సిద్ధార్థ కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్న వెంకటేష్, 2022లో జూనియర్ స్థాయిలో ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అక్కడ రాణించడం ద్వారా జాతీయ క్రీడల్లో పాల్గొన్నాడు. తరువాత పలు పోటీలలో కృష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు ఈ నెల 11,12 తేదీలలో ఇచ్ఛాపురం మండలం భైరిపురం వద్ద నిర్వహించిన ఆహ్వాన వాలీబాల్ పోటీలలో కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఈపోటీల్లో వెంకటేష్ ప్రాతినిధ్యం వహించిన కృష్ణా జిల్లా జట్టు విజేతగా నిలవడంతోపాటు విశేష ప్రతిభ చూపిన వెంకటేష్‌కు ప్రత్యేక బహుమతి లభించింది

ఇదేనా 'సహకారం'

- సభ్యుల డిపాజిట్లు రూ.కోటి
- ఏటా రూ.60 లక్షల ఆదాయం
- కేవలం వ్యవసాయ రుణాలతో సరి?
- కోటవురట్ల పిఎసిఎస్ పరిస్థితి



కోటవురట్ల పిఎసిఎస్

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల కేంద్రంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రధాన కూడలిలో అలంకారప్రాయంగా దర్శనమిస్తుందే తప్ప రైతులకు ఎటువంటి సహాయ సహకారాలు సంఘం అందించలేకపోతోందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. మండల వ్యాప్తంగా 25 గ్రామపంచాయతీలకు చెందిన దాదాపు ఐదువేల మంది వరకు సభ్యులు ఉండడంతో సభ్యుల నుండి సభ్యత్వం, డిపాజిట్లుగా దాదాపు రూ.కోటి రూపాయల వరకు నిధులు ఉన్నాయి, సంఘం ద్వారా గతంలో సంఘ సభ్యులకు వివిధ రకాల రుణాలతోపాటు పరికరాలు, ఎరువులు, విత్తనాలు, వ్యక్తిగతంగా పశువుల రుణాలు అందజేసేవారు, ప్రస్తుతం సంఘం కేవలం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలకు మాత్రమే పరిమితమైంది, ఏటా సభ్యులకు రూ.12 కోట్ల వరకు ప్రభుత్వపరంగా రుణాలు అందజేస్తున్నామని, సభ్యుల్లో దాదాపు రెండు వేల మంది మాత్రమే రుణాలు తీసుకుంటున్నారని పిఎసిఎస్ కార్యదర్శి రామకష్ణ తెలిపారు, రైతుల నుంచి ఏడు శాతం వడ్డీ వసూలు చేస్తున్నామని, రూ.లక్ష దాటితే మూడు శాతం మాత్రమే వడ్డీ వసూలు చేస్తామని అన్నారు, జిల్లా సహకార జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నుండి లావాదేవీలు జరుగుతాయని, సకాలంలో రుణం చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ రాయితీ అందిస్తుందని అన్నారు, ఏటా వడ్డీ రూపేనా సంఘానికి రూ.60 లక్షల వరకు ఆదాయం లభిస్తుందన్నారు, సహకార సంఘానికి ఎదురుగా మూడుషాప్ నిర్మాణం చేపట్టడంతో పాటు, షాప్ ల నుంచి వచ్చే ఆదాయం ఏటా రూ.60 వేల వరకు ఉందని, వారి వద్ద నుంచి డిపాజిట్ రూపేనా దాదాపు రూ.2.50 లక్షలు వసూలు చేసామన్నారు, సంఘానికి ఆరుగురు పర్మినెంట్ సిబ్బంది ఉండగా ఒకరు కాంట్రాక్టు పద్ధతితో పని చేస్తున్నట్లు తెలిపారు. ఇంతటి ప్రాముఖ్యత గలిగిన సహకారం సంఘం నుంచి వ్యవసాయ రుణాలతోపాటు సభ్యులైన రైతులకు ఇతర అనుబంధ సేవలు, రుణాలను, ఉపకరణాలను అందిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు సభ్యులు అభిప్రాయపడుతున్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో ఏఎల్‌పురం ప్రభుత్వ కళాశాలలో బుధవారం నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కేంద్రంలో మండలంలోని నాలుగు కళాశాల నుండి 480 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. గొలుగొండ గురుకుల కళాశాల నుండి 60 మంది, కేజీబీవీ నుండి 30 మంది, ఏఎల్‌పురంలో ఉన్న ఎల్ఎంఎల్ నాయుడు ప్రైవేట్ కళాశాల నుండి 30 మంది, స్థానిక ప్రభుత్వ కళాశాల నుంచి 160 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో 250 మంది బాలురు, 230 మంది బాలికలు ఉన్నారు. పరీక్షలకు ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాధిక, కొయ్యూరు అధ్యాపకులు శ్రీనివాస్ డిఒగా వ్యవహరిస్తారు. 11 సీసీ కెమెరాల నిఘా మధ్య ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి.

నేడు విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో లింగంపేట గ్రామంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన నూకాలమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట బుధవారం జరగనుంది. నూకాంబిక ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ బొందల నూకరత్నం ఆధ్వర్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.30 లక్షలతో ఆలయం నిర్మించారు. విగ్రహ ప్రతిష్టకు రెండురోజులుగా పూజలు నిర్వహిస్తున్నారు.. రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బొందల రాజు, స్థానిక సర్పంచ్ సంతోష్ కుమార్, గోలకొండ కుటుంబీకుల సహకారంతో విగ్రహ ప్రతిష్ట, అన్న సమారాధన నిర్వహిస్తున్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం



మజ్జిగ పంపిణీ చేస్తున్న జనసేన కార్యకర్తలు

ప్రజాశక్తి-మాడుగుల : మాడుగులలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం రొబ్బ మహేష్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.బస్‌స్టాండ్ వద్ద కేక్ కట్ చేశారు అనంతరం మోదకొండమ్మ ఆలయం వద్ద తీర్థం సందర్భంగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జన సైనికులు కోళ్ళ చిన్న, రాకేటి నూకరాజు, గల్లా గణేష్, మంచాల శివ, ఇళ్లపు రమేష్, బెజవాడ రాజేష్, శాంతో నూకరాజు, అప్పి మధు పాల్గొన్నారు

నర్సీపట్నంలో వ్యాపారుల స్వచ్ఛంద బంద్

రోడ్డు విస్తరణను 80 అడుగులకు పరిమితం చేయాలని డిమాండ్



బంద్‌లో భాగంగా ర్యాలీ చేస్తున్న రోడ్డు విస్తరణ బాధితులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : డివిజన్ కేంద్రమైన నర్సీపట్నంలో ప్రధాన రహదారి 100 అడుగులకు చేపడుతున్న నేపథ్యంలో స్థానిక వ్యాపారస్తులు, షాపు యజమానులు స్వచ్ఛంద బంద్‌ను నిర్వహించారు. రోడ్డు విస్తరణను 80 అడుగులకు పరిమితం చేయాలని కోరుతూ ప్లకార్డులతో పట్టణ ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకుని, వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాధిత వ్యాపారస్తులు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నర్సీపట్నం పర్యటన సందర్భంగా ప్రధాన రహదారిని వంద అడుగుల విస్తరించే పనులకు శంకుస్థాపన చేశారన్నారు. దీనికి అనుగుణంగా అధికారులు ఇప్పటికే వంద అడుగులు విస్తరించేందుకు మార్కింగ్ చేయడంతో తమ దుకాణాలు పోయి, నివాసాలతోపాటు వ్యాపారాలు నష్టపోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 100 అడుగుల మేర రోడ్డును విస్తరించేందుకు ప్రస్తుతం చేసిన మార్కింగ్‌ను బట్టి ప్రధాన రోడ్డును ఆనుకొని రెండువైపులా ఉన్న భవనాలు, వ్యాపార సంస్థలను దాదాపు పూర్తిగా తొలగించాల్సి ఉంటుందని, అలా జరిగితే చాలా నష్టపోతామని వాపోయారు. రోడ్డు విస్తరణకు 80 అడుగులకు పరిమితం చేస్తే తక్కువ స్థాయిలో భవనాలను తొలగించాల్సి ఉంటుందని వేడుకున్నారు కట్టడాల నష్టాన్ని తగ్గించేందుకు 80 అడుగులకు పరిమితం చేయాలని, ఈ విషయాన్ని ఇప్పటికే అధికారులు దష్టికి తీసుకెళ్లామని వారంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోకుండా ముందుకు సాగడంతో నిరసన వ్యక్తం చేస్తూ స్వచ్ఛంద బంద్ పాటిస్తున్నామని వెల్లడించారు. బంద్ సందర్భంగా పట్టణంలో ప్రముఖ వ్యాపార సంస్థలైన సిఎమ్ఆర్ షాపింగ్ మాల్, సౌత్ సెంట్రల్ షాపింగ్ మాల్, మోర్ వంటి పలు రకాల వ్యాపార సంస్థలు బంద్‌లో పాల్గొన్నాయి. తమకు అన్యాయం జరగకూడదన్న ఉద్దేశ్యంతోనే బంద్ చేస్తున్నామే తప్ప తాము రోడ్డు విస్తరణకు, అభివృద్ధికి, ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని వ్యాపారులు, దుకాణ యజమానులు స్పష్టం చేస్తున్నారు.